క్లుప్తంగా

పాఠ్యపుస్తకాల పంపిణీ



మచిలీపట్నంటౌన్: నగరంలోని 21వ డివిజన్ బందరుకోట మునిసిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలను పంపిణీచేశారు. డివిజన్ కార్పొరేటర్ మన్నే శారద చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యలో మంచి మార్కులు సాధించేందుకు పోటీ పడాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.వి.రఘుకాంత్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ తిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ మన్నే శేషారావు తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు సీమంతం



మోపిదేవి: మండలంలోని మెరకనపల్లి గ్రామంలో ముత్యాల పోతురాజుకు చెందిన గోమాతకు గురువారం సీమంతం నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమ, పూలు, పలు రకాల ఆహార పదార్థాలతో పూజలు నిర్వహించారు. రెండో ఈతకు వచ్చిన జర్సీ ఆవుకు చేసిన సీమంతం వేడుకలో పలువురు రైతులు, మహిళలు పాల్గొన్నారు. పోతురాజు దంపతులను గ్రామస్తులు అభినందించారు.

మాదిగల ఆత్మగౌరవ కవాతు విజయవంతానికి వినతి

ఘంటసాల: వరంగల్‌లో జూలై ఏడో తేదీన జరిగే మాదిగల ఆత్మ గౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎంఆఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు బొకినాల కృష్ణ కోరారు. మండలంలోని శ్రీకాకుళం శివారు సూరపనేనిపాలెంలో గురువారం కృష్ణ మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ సారథ్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మాదిగల ఆత్మ గౌరవ కవాతు జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కవాతుకు కృష్ణా జిల్లాలోని మాదిగ ఉద్యోగులు, మహిళలు, యువకులు, ఎమార్పీఎస్ కార్యకర్తలు వేలాదిగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో తీర్పు రిజర్వులో ఉంచిన విషయాన్ని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఎమ్మార్పీఎస్ పోరాటం కొనసాగుతుందని కృష్ణ తెలిపారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



మచిలీపట్నంటౌన్: నగరంలోని 12వ డివిజన్ కొత్త రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పైప్‌లైన్ దెబ్బతినటంతో మునిసిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది గురువారం మరమ్మతులు చేపట్టారు. ఆ డివిజన్ కార్పొరేటర్, మాజీ డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బందెల థామస్‌నోబుల్ పర్యవేక్షణలో మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. వర్షం కారణంగా కలుషిత నీరు పైప్‌లోకి చేరి ఉంటుందన్నారు. శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి తాగునీటి సరఫరా సమయంలో ప్రజలు ముందు వచ్చిన నీటిని పట్టుకోవద్దని సూచించారు. మంచిగా వచ్చిన నీటిని వినియోగించాలని పేర్కొన్నారు. నోబుల్ కాలనీ, రైలుపేట, జనశక్తి నగర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు నీటిని పరిశీలించి పట్టుకోవాలని కోరారు.

21 కాసుల బంగారు నగల చోరీ



కృత్తివెన్ను: ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంట్లో చొరబడి చోరీ చేసిన ఘటన కృత్తివెన్ను మండలంలోని పాశ్చాపురం గ్రామంలో జరిగింది. కృత్తివెన్ను ఎస్ఐ కె.నాగరాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాటూరి రవికుమార్ ఈ నెల 16వ తేదీన తన భార్యకు అనారోగ్యంగా ఉండటంతో విజయవాడ హాస్పిటల్‌కు వెళ్లారు. అక్కడే కొద్ది రోజులు ఉండాల్సి వచ్చింది. ఈ నెల 26వ తేదీన రవికుమార్ ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్లు పక్కింటి వారు గుర్తించారు. వెంటనే రవికుమార్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన వచ్చి చూడగా ఇంటిలో బంగారు, వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో గురువారం పోలీసులు, క్లూస్ టీం సభ్యులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 21 కాసుల బంగారు నగలు, 500 గ్రాముల వెండి వస్తువులను దొంగలు చోరీ చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

డయేరియా కేసులు రాకుండా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



ప్రసూతి వార్డులో బాలింతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

అవనిగడ్డ: నియోజకవర్గంలో ఒక్క డయేరియా కేసు కూడా నమోదవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. అవనిగడ్డలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆయన గురువారం ఆకస్మికంగా తనఖీ చేశారు. వైద్యులతో కలసి ఏరియా ఆస్పత్రిలో జనరల్ ఇన్ పేషెంట్, పురుషులు, మహిళల వార్డులు, జనరల్ ఓపీ వార్డులను పరిశీలించారు. ప్రసూతి వార్డులో గర్భిణులు, బాలింతలను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సేవల విభాగంలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందిస్తున్న చికిత్స గురించి ఆరా తీశారు. త్వరలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఆస్పత్రి అభివృద్ధి, మరమ్మతులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లా వైపు కొన్ని ప్రాంతాల్లో డయేరియా ప్రబలిన నేపథ్యంలో అవనిగడ్డ నియోజకవర్గంలో ఆ వ్యాధికి దారితీసే ఏ ఒక్క అవకాశం ఇవ్వకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో సమస్యాత్మకంగా ఉన్న తాగునీటి పథకాలను పరిశీలించి వాటి మరమ్మతులకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించటంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఒక్క డయేరియా కేసు వచ్చినా వెంటనే అధికారులు స్పందించి కేసు నమోదైన గ్రామం పై ప్రత్యేక శ్రద్ధవహించేలా సూచనలు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రతి గ్రామంలో అధికార యంత్రాంగం తాగునీటి పరీక్షలు చేపట్టినట్లు చెప్పారు. ప్రజలు తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని బుద్ధప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయకుమార్, వైద్యులు డాక్టర్ సురేంద్రనాథ్, డాక్టర్ శైలేంద్ర, డాక్టర్ అశోక్, డాక్టర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీగంగ, పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంతో పాటు శ్రీశ్యామలాంబ తల్లి ఆలయం, నియోజకవర్గంలో అన్ని ఆలయాలను అభివృద్ధి చేస్తామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆలయాల అభివృద్ధిపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. పెడన నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. దాతల ఔదార్యంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా శ్రీగంగ, పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి, శ్రీ శ్యామలంబ సమేత రామలింగేశ్వర స్వామి వార్ల ఆలయాలకు నూతన అభివృద్ధి కమిటీలను ప్రకటించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా ఆలయానికి విచ్చేసిన కాగిత కృష్ణప్రసాద్‌కు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు. శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో గర్భగుడి ద్వారానికి వెండి తాపడం, స్వామివారికి బంగారు నామాలతో పాటు పలు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీతో కలిసి నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, బళ్ల ప్రసాద్, చందన నారాయణరావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి తిక్కిశెట్టి రామ్మోహన్‌రావు, శలపాటి ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ హరనాథ్, ఎంపీడీఓ రామ్‌కుమార్ తదితరులు

నాగాయలంక: మండలంలో డయేరియా ప్రబలకుండా తక్షణ చర్యలతో అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం పంచాయతీ రాజ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం జరిగింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి సూచనలు అనుసరించి చేపట్టాల్సిన పనులను తహసీల్దార్ వివరించారు. మండల పీఆర్ విస్తరణాధికారి కె.అప్పల నరసమ్మ మాట్లాడుతూ.. మండలంలో తొమ్మిది గ్రామ పంచాయతీల్లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులన్నింటిని శుభ్రపర్చాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. ట్యాంకులను శుభ్రం చేసిన తేదీ, తరువాత శుభ్రం చేయాల్సిన తేదీలను ట్యాంకు వద్ద నోటీస్ బోర్డులో నమోదు చేయడంతోపాటు పరసర ప్రజలతో రిజిస్టర్‌లో సంతకాలు తీసుకునేలా చర్యలు చేపట్టామని వివరించారు. జిల్లా కలెక్టర్ ఎప్పుడైనా ఆకస్మిక పర్యటనలతో గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను అంచనా వేసే అవకాశం ఉన్నందున సంబంధిత ఉద్యోగులు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని తహసీల్దార్ సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.సీతారామ్‌కుమార్, గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్షంతో చిగురించిన రైతుల ఆశలు




పెడన మండలంలో వెద సాగు పొలంలో మొలకెత్తిన విత్తనాలు

పెడన: పది, పదిహేను రోజుల నుంచి ఆకాశంలో కారు మబ్బులు దట్టంగా పట్టినా వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మొన్నటి వరకు వెదసాగు పద్ధతి ద్వారా వరి సాగు చేపట్టిన రైతులు, పొలంలో చల్లిన విత్తనాలు మొలకెత్తడానికి వర్షాలు కోసం ఎదురుచూశారు. మరికొందరు రైతులు వరి నారుమడుల్లో విత్తనాలు మొలకెత్తేందుకు వర్షం ఎప్పుడు పడుతుందా అని ఆకాశం వంకా చూస్తూ రోజులు గడిపారు. కాలువలకు సాగునీరు రావడం తీవ్ర జాప్యం అవుతుండటంతో వర్షంపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఈ పరిస్థితి ఉంటే బాగుంటుందని, ఏమాత్రం అధిక వర్షాలు పడ్డా మళ్లీ ఇబ్బందేనని రైతులు పేర్కొంటున్నారు. 15 రోజులుగా ఎదురు చూస్తున్న రైతులకు ఈ వర్షం ఊరట ఇచ్చింది.

రోజంతా ఎడతెరిపి లేని వర్షం

కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కోడూరు మండలంలో ఎడతెరిపి లేని వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు ఓ మోస్తారు వర్షం కురుస్తూనే ఉంది. 15 రోజుల నుంచి ఆకాశం మేఘావృతమైనా వర్షం పడలేదు. ఆవర్తనం ప్రభావంతో రోజంతా వర్షం కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి పంట వేసుకొనేందుకు పంట పొలాలను దుక్కులు దున్నుకొని సిద్ధం చేశారు. ఎడతెరిపిలేని వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచింది.



మాచవరం సమీపంలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

నిత్యావసరాల ధరలు తగ్గించాలి : సీపీఎం



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే నిత్యావసర సరుకుల ధరలు పెరగడం విచారకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలతోపాటు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సామాన్యులకు నెలకు 20 రోజులు కూడా పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పెరుగుతున్న ధరలు వారికి అధిక భారంగా మారాయన్నారు. ఈ ధరలను భరించే స్థితిలో వారు లేరని రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పి.రజిని, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో తాగునీరందించేలా చర్యలు – ఎంపీపీ గరుడప్రసాద్



కృత్తివెన్ను: మండల ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగింది. మెగారక్షిత మంచినీటి చెరువు నుంచి కొన్ని రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిన విషయాన్ని పలువురు ప్రజాప్రతినిధులు సమావేశంలో తెలపగా ఎంపీపీ స్పందించారు. అండర్ టన్నెల్ సమీపంలో పైపులైను పాడైపోవడంతో సమస్య ఉన్నట్లు తెలియడంతో దాని రిపేరు కోసం మండల పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తానని ఎంపీపీ ప్రకటించారు. తాగునీటితో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల నివేదికలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మైల రత్నకుమారి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీఓ శ్రీనివాసవర్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గూడూరు మండల సర్వసభ్య సమావేశం

గూడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరుగుతుందని ఎంపీడీఓ ఎస్.ప్రేమాన్విత గురువారం తెలిపారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులంతా విధిగా హాజరు కావాలని కోరారు.

విద్యతోనే బంగారు భవిష్యత్

పామర్రు: విద్యతోనే బంగారు భవిష్యత్ లభిస్తుందని పామర్రు ఎంఈవో–2 పద్మవాణి పేర్కొన్నారు. స్థానిక కంచర్లవానిపురంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యా ప్రవేశం కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడీడు పిల్లలంతా పాఠశాలలో ఉండాలని పిలుపునిచ్చారు. చదువు మానేసి ఇళ్ల వద్దే ఉంటున్న విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని వివరించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం బి.టి.వి.లక్ష్మీకుమారి విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పలకలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జె.ఏసురత్నం, సీహెచ్. శ్రీనివాసరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్టేట్ ర్యాంకర్ లిఖితకు సత్కారం



లిఖితను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

అవనిగడ్డ: ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్ పరీక్ష ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన అవనిగడ్డ లంకమ్మ మాన్యం ప్రాంతానికి చెందిన అల్లంశెట్టి లిఖితను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ గురువారం సత్కరించారు. అవనిగడ్డ ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థిని లిఖిత ఫస్ట్ ఇయర్‌లో 470 మార్కులకు 466 సాధించి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ తన స్వగృహంలో విద్యార్థినిని సత్కరించారు. అవనిగడ్డ కోర్టు ఉద్యోగి అల్లంశెట్టి వెంకటేశ్వరరావు కుమార్తె లిఖిత రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించి అవనిగడ్డ నియోజకవర్గానికి మంచి పేరు తేవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, విద్యార్థిని తండ్రి అల్లంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం చేస్తాం

ఎస్టీ కార్పొరేషన్ ఈడీ ప్రకాశరావు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్టీ కార్పొరేషన్ ఈడీ ప్రకాశరావు, సర్పంచ్ కృష్ణ కుమారి

చల్లపల్లి(అవనిగడ్డ): అగ్ని ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన నిరుపేద ఎస్టీ కుటుంబానికి తమ కార్పొరేషన్ ద్వారా సహాయం చేస్తామని ఎస్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.ప్రకాశరావు హామీ ఇచ్చారు. చల్లపల్లి నారాయణరావునగర్ ఎస్టీ కాలనీలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరుపేద ఎస్టీ మహిళ గరికిపాటి యశోద నివసించే పూరిల్లు పూర్తిగా, మాజీ సర్పంచ్ కట్టా పద్మావతి తల్లిదండ్రులు కుంభా నాగేశ్వరమ్మ, వెంకయ్య నివసించే పూరిల్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఘటనా స్థలాన్ని ఈడీ ప్రకాశరావు తమ సిబ్బందితో గురువారం పరిశీలించి బాధితులను పరామర్శించారు. బాధితులకు ఎస్టీ కార్పొరేషన్ ద్వారా సహాయం చేయడంతో పాటు ప్రభుత్వం ద్వారా పక్కా గృహం మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణ కుమారి, పంచాయతీ ఈఓ పి.వి.మాధవేంద్రరావు, వై.శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

అవనిగడ్డ: పేద విద్యార్థులను ప్రోత్సహించే ప్రతి ఒక్కరూ స్ఫూర్తి ప్రదాతలేనని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని బందలాయిచెరువు ఎంపీపీ స్కూల్లో గురువారం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి దాతల సాయం తోడుకావడం శుభపరిణామమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో విద్యా బోధన అందుతుందన్నారు. పాఠ్య పుస్తకాలు, బ్యాగ్, యూనిఫాం ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యార్థులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్న హెచ్‌ఎం పద్మావతి సేవలను అభినందించారు. అనంతరం గ్రామానికి చెందిన లండన్ వాసి పుప్పాల ధనుంజయ్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు నోట్ బుక్స్, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు చీరలను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువనేత మండలి వెంకట్రామ్ (రాజా), జనసేన అవనిగడ్డ మండల అధ్యక్షుడు గుడివాక శేషు బాబు, గుడివాక శివరావు, కమ్మిలి మారిబాబు, టీడీపీ నాయకుడు కొండవీటి లోకేశ్వరరావు, ఎంఈఓ నారేపాలెం శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లపైనే విద్యాశాఖ అధికారులకు ప్రేమ

బంటుమిల్లి ఎంపీపీ చినబాబు



లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎంపీపీ చినబాబు తదితరులు

బంటుమిల్లి: జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వ పాఠశాలల కన్నా ప్రైవేటు పాఠశాలలపై ప్రేమ ఎక్కువ అని ఎంపీపీ వీ.చినబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు స్కూళ్లలో జరిగే సంక్రాంతి సంబరాలపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణపై లేదని ఆక్షేపించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు నివేదికలు సమర్పించారు. ఇందులో భాగంగా విద్యాశాఖ నుంచి ఎంఈఓ టి.త్రిపురసుందరీదేవి నివేదిక ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ ఏర్పాటు చేసిన కంప్యూటర్ తదితర సౌకర్యాలను వివరించారు. దీనిపై ఎంపీపీ చినబాబు స్పందించి నాడు–నేడు పథకంలో ప్రభుత్వం ఇచ్చిన కంప్యూటర్లను ఉపయోగించి విద్యార్థులకు ఏమైనా ప్రముఖ విషయాలపై అవగాహన కలిగించారా అని ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు నమ్మకం కలిగించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయ నివేదికపై ఎంపీపీ స్పందిస్తూ.. రైతులకు సకాలంలో కాకుండా అదును దాటాక విత్తనాలు ఇస్తే ఉపయోగం ఏమిటని నిలదీశారు. వ్యవసాయ అధికారుల ఉదాసీనవైఖరి కారణంగా ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన సాంకేతిక పరిజ్ఞానం అలంకార ప్రాయంగా మారిందన్నారు. గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు సమన్వయంతో రాజకీయాలకు తావులేకుండా స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీపీ చినబాబు కోరారు. జిల్లా పరిషత్ గ్రాంటు నుంచి మండలానికి 35 కుట్టు మిషన్లు మంజూరవగా శిక్షణ పొందిన 21 మందికి మాత్రమే మిషన్లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారులు వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యులు ఎం.వెంకటరమణ, వైస్ ఎంపీపీలు ఓ.చిన్నారిబాబు, కె.లలిత, ఎంపీటీసీ సభ్యులు పి.భగవాన్, ఎం.రుక్మిణి, ఎండీ కమాల్ బాషా, ఎం.లక్ష్మీశకుంతల, టి.ఎస్.లక్ష్మి, ఎంపీడీఓ జి.ఎస్.రామకృష్ణరాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

● ప్రకృతి ఛత్రం



కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారిలో పచ్చదనంతో ఆకర్షిస్తున్న చెట్లు

రహదారి పొడవునా ఆహ్లాదాన్ని పంచే పచ్చదనం వాహనచోదకుల మనసును దోచేస్తోంది. కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులకు పచ్చదనం కనువిందు చేస్తోంది. కొత్తపేట నుంచి రామచంద్రపురం వరకు, మాచవరం నుంచి వి.కొత్తపాలెం వరకు రోడ్డును రెండు వైపుల నుంచి పచ్చని చెట్లు గొడుగులా కప్పేశాయి. ఈ మార్గాన ప్రయాణించే వారికి ఈ చెట్లు ఆహ్లాదం పంచుతున్నాయి. – కోడూరు

1వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఒకటో డివిజన్‌లో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు జరిగాయి. డివిజన్‌లోని డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్త, చెదారాలను తొలగించటంతో పాటు పల్లపు ప్రాంతాల్లో ఉన్న వర్షపునీరు బయటకు వెళ్లేందుకు కార్మికులు గాళ్లు తవ్వారు. ఈ పనులను కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, సిబ్బంది పర్యవేక్షించారు.